సాక్షి ఖమ్మం

శుక్రవారం । 13 । సెప్టెంబర్ । 2024



జిల్లాలో ఏచూరి అడుగులు

సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారామ్ మృతి నేపథ్యాన ఆయనతో ఉన్న అనుబంధాన్ని జిల్లా నాయకులు గుర్తు చేసుకున్నారు. 8లో



జాతీయ విపత్తుగా ప్రకటించాలి

ఇటీవల వరదలతో భారీ నష్టం జరిగినందున జాతీయ విపత్తుగా ప్రకటించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని డిమాండ్ చేశారు. 8లో

గరిష్టం / కనిష్టం

33° / 23°

వాతావరణం

జిల్లాలో శుక్రవారం ఉదయం నుంచే ఎండ ప్రభావం ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత ఉష్ణోగ్రత పెరిగే అవకాశముంది.

రైతులకు అండగా 'సాక్షి'

జిల్లా వ్యవసాయాధికారితో నేడు 'ఫోన్ఇన్'



డి.పుల్లయ్య, డీఏఓ

సాక్షి ఫోన్ ఇన్

ఖమ్మంవ్యవసాయం: భారీ వర్షాలు, వరదలు పంటలపై తీవ్ర ప్రభావాన్ని చూపించాయి. దాదాపు పది రోజుల పాటు వర్షం, గాలిలో తేమశాతం కారణంగా పైర్లు తెగుళ్ల బారిన పడ్డాయి. ఈనేపథ్యాన పత్తి, వరి, మొక్కజొన్నతో పాటు మిరప, బొప్పాయి, అరటి, కూరగాయలు, ఇతర తోటల్లో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు, తెగుళ్ల నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించాలని 'సాక్షి' సంకల్పించింది. ఈమేరకు శుక్రవారం 'ఫోన్ ఇన్' నిర్వహిస్తుండగా జిల్లా వ్యవసాయాధికారి(డీఏఓ) ధనసరి పుల్లయ్యతో పాటు నిపుణులు పాల్గొని రైతుల సందేహాలకు సమాధానాలు ఇస్తారు.

తేదీ : 13-09-2024, శుక్రవారం

సమయం : ఉదయం 9 నుంచి 10 గంటల వరకు

ఫోన్ చేయాల్సిన నంబర్ :

72888 94200

న్యూస్‌రీల్

మత్స్యకారులకు శిక్షణ ప్రారంభం



చేపల మేత తయారీపై శిక్షణ ఇస్తున్న శాస్త్రవేత్తలు

కూసుమంచి: మండలంలోని పాలేరులో శ్రీ పీ.వీ.నర్సింహారావు మత్స్య పరిశోధనా కేంద్రంలో ఖమ్మం, సూర్యాపేట జిల్లాల మత్స్యకారులకు మూడు రోజుల శిక్షణ గురువారం ప్రారంభమైంది. శిక్షణను యూనియన్ బ్యాంకు మేనేజర్ రమేష్ ప్రారంభించి మాట్లాడారు. శిక్షణను సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ లక్ష్యాల మేరకు మత్స్యకారులు దిగుబడులు సాధించి ఆర్థికాకాభివృద్ధి సాధించాలని సూచించారు. పాలేరు పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్యాంప్రసాద్ మాట్లాడగా శాస్త్రవేత్త రవీందర్ పలు అంశాలపై అవగాహన కల్పించారు.

'నా ఖమ్మం కోసం నేను'కు విరాళాల వెల్లువ

ఖమ్మం సహకారనగర్: మున్నేటి వరదతో అతలాకుతలమైన ఖమ్మంలోని పరీవాహక ప్రాంత ప్రజలను ఆదుకునేందుకు 'నా ఖమ్మం కోసం నేను' పేరిట చేపట్టిన కార్యక్రమానికి మంచి స్పందన వస్తోం దని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. వినాయక చవితి నవరాత్రులను పురస్కరించుకుని మండపాల వద్ద ప్రత్యేక బాక్స్‌లు ఏర్పాటుచేయగా ప్రజలు దుస్తులు, నగదు వేస్తున్నారని పేర్కొన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు రూ.11.20 లక్షల మేర విరాళాలు అందాయని తెలిపారు. అలాగే, 7,419 కిలోల బియ్యం, 1,230 జతల బట్టలతో పాటు బ్లాంకెట్లు, నోట్ పుస్తకాలు, చెప్పులు, ఇతర సామగ్రి వచ్చాయని వెల్లడించారు.

నాణ్యమైన పౌష్టికాహారం అందించాలి



వంటశాలలో పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

ఖమ్మంవైద్యవిభాగం: ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారికి నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్ ఆదేశించారు. ఆస్పత్రిని గురువారం తనిఖీ చేసిన ఆయన వంటశాలలో ఆహారం నాణ్యతను పరిశీలించారు. చికిత్స పొందుతున్న వారికి ఇస్తున్న భోజనం వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ నాణ్యమైన పౌష్టికాహారం అందచేయడం ద్వారా బాధితులు త్వరగా కోలుకుంటారని తెలిపారు. వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రకాశ్‌నగర్ బ్రిడ్జిపై నుంచి ప్రవహిస్తున్న మున్నేటి వరద (ఫైల్)



లెక్కలేనంత వరద..

మున్నేటికి 36.9 అడుగుల మేర వచ్చినట్లు ప్రకటన

- కానీ 40 అడుగుల వరకు వచ్చిందని అంచనా
- మున్నేటి వద్ద 25 అడుగుల వరకే ఫ్లడ్ గేజ్
- భారీ వరదకు తోడు చెక్‌డ్యామ్‌ల బ్యాక్‌వాటర్‌తో అల్లకల్లోలం
- భవిష్యత్‌లో వరదను తట్టుకునేలా అధికారుల కసరత్తు
- రిటైనింగ్ వాల్, కరకట్టలో ఏది నిర్మించాలనే అంశంపై సందిగ్ధత

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: మున్నేటికి కనీవినీ ఎరుగని రీతిలో వరద రావడంతో విపత్తు సంభవించింది. ఇందుకు భారీ వర్షాలు ఒక కారణమైతే.. ఇంకొన్ని అంశాలూ కారణమయ్యాయని అధికారులు గుర్తించినట్లు సమాచారం. వీటిన్నింటినీ పరిగణనలోకి తీసుకుంటున్న అధికారులు భవిష్యత్‌లో మున్నేరు పరీవాహక ప్రాంతాలను వరద ముంచెత్తకుండా చేపట్టాల్సిన చర్యలపై ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. ఈనెల 1న మున్నేటికి 36.9 అడుగుల మేర వరద వచ్చినట్లుగా అధికారులు అంచనా వేశారు. అయితే దాదాపు 40 అడుగుల వరద వచ్చినట్లు తెలుస్తోంది. అలాగే ఖమ్మంలోని ప్రకాష్‌నగర్ చెక్‌డ్యామ్ బ్యాక్‌వాటర్ తోడు కావడంతో ఉధృతి పెరిగినట్లు సమాచారం. ఈ పరిస్థితులన్నింటినీ గమనించిన ప్రభుత్వం రిటైనింగ్‌వాల్ నిర్మాణంపై సందిగ్ధంలో పడినట్లు తెలుస్తోంది. మున్నేటి పరీవాహక ప్రాంతమైన ఖమ్మం నగరం, రూరల్ మండలాలు భవిష్యత్‌లో సురక్షితంగా ఉండేలా రిటైనింగ్ వాల్ నిర్మిస్తే మేలా లేక భద్రాచలం మాదిరి కరకట్ట నిర్మించాలా అనే ఆలోచన చేస్తున్నట్లు సమాచారం.

దాదాపు 40 అడుగుల వరద..

మున్నేటికి గత 31, ఈనెల 1, 2 తేదీల్లో వచ్చిన వరద ప్రభావాన్ని అధికారులు అంచనా వేస్తున్నారు. ఖమ్మంలోని కాల్వొడ్డు పాత బ్రిడ్జి పిల్లర్లపై ఫ్లడ్ గేజ్ 25 అడుగుల వరకే ఉండడంతో మున్నేటి వరదను కచ్చితంగా నిర్ధారించలేకపోయారు. అయినా అంచనా ఆధారంగా 36.9 అడుగుల మేరకు వరద వచ్చినట్లు ప్రకటించారు. కానీ మున్నేరు శాంతించాక పరిస్థితులన్నీ పరిగణనలోకి తీసుకున్న అధికారులు దాదాపు 40 అడుగుల మేర వచ్చినట్లు గుర్తించారని తెలుస్తోంది. వరద ప్రభావంతో ఖమ్మం నగరంలోని 14 డివిజన్లు, ఖమ్మంరూరల్ మండలంలోని దాదాపు 20 గ్రామాలు నీట మునిగాయి. ఇదే సమయంలో ప్రకాష్‌నగర్ బ్రిడ్జి పైనుంచి ఉధృతంగా ప్రవహించింది.

ఇవేనా కారణాలు..

వరద ప్రభావం తగ్గాక కారణాలను యంత్రాంగం సమీక్షిస్తోంది. ఎగువన కురిసిన భారీ వర్షాలతో ఒకేసారి మున్నేటికి భారీ వరద చేరింది. దీనిపై ముందస్తు హెచ్చరికలు లేకపోవడంతో అధికారులు వెంటనే స్పందించడం సాధ్యం కాలేదు. ఆ సమయంలో 31 నుంచి 32 అడుగుల వరద వచ్చినట్లు అంచనా. అయితే బఫర్‌జోన్ ఆక్రమణలతో నీరు సాఫీగా వెళ్లేందుకు మార్గం లేకపోవడం.. ప్రకాష్‌నగర్‌లో నిర్మించిన చెక్‌డ్యామ్ ఎత్తు 8 మీటర్లు ఎక్కువగా ఉండడంతో బ్యాక్‌వాటర్ కారణంగా పరీవాహక ప్రాంతాలు ప్రభావితమయ్యాయి. ఈ నీటి ప్రభావంతో దాదాపు 8 నుంచి 9 అడుగుల వరద అదనంగా చేరినట్లు సమాచారం.

మున్నేరు ముంచకుండా..

ఊహించని స్థాయిలో వచ్చిన వరదతో అధికారులతోపాటు ప్రభుత్వం కూడా భవిష్యత్‌లో ఇలా జరగకుండా ఏం చేయాలా అన్న అంశంపై యోచిస్తున్నట్లు తెలిసింది. రిటైనింగ్ వాల్ లేదా కరకట్టలో ఏది నిర్మించాలనే అంశంపై చర్చ సాగుతోంది. మరోవైపు ఆక్రమణలపైనా అధికారులు దృష్టి సారించారు. ఇప్పటికే నాలాలపై ఆక్రమణలను తొలగిస్తున్నారు. ఇక కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఖమ్మంను వరదల బారి నుంచి రక్షించేలా అర్బన్ ప్లాన్ తయారీపై దృష్టి పెట్టారు.

రిటైనింగ్ వాల్ కడితే సరిపోతుందా?

గత ఏడాది మున్నేటికి 30.7 అడుగుల మేరకు వరద చేరింది. దీంతో 33 అడుగుల ఎత్తుతో ఇరువైపులా 8.5 కి.మీ. చొప్పున మొత్తం 17 కి.మీ. మేర రిటైనింగ్ వాల్ నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే నిధులు కేటాయించడంతో టెండర్ ప్రక్రియ పూర్తయింది. అయితే ఈ ఏడాది మున్నేటికి 36.9 అడుగుల వరద వచ్చిందని చెబుతున్నా 40 అడుగులు దాటిందని అంచనా. ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకున్న అధికారులు రిటైనింగ్ వాల్ నిర్మాణం రక్షణ కల్పిస్తుందా అన్న అంశంపై మల్లగుల్లాలు పడుతున్నారు. భారీ వరదలను రిటైనింగ్ వాల్ తట్టుకోలేదనే చర్చ అధికార వర్గాల్లో సాగుతోంది. భద్రాచలంలో గోదావరి వద్ద కరకట్ట తరహాలో ఇక్కడ కూడా నిర్మిస్తేనే రక్షణ ఉంటుందని కొందరు అధికారులు భావిస్తున్నట్లు సమాచారం. దీంతో కరకట్ట ఎన్ని కి.మీ., ఏయే ప్రాంతాలను కలుపుతూ నిర్మించాలనే అంశంపై ఆలోచన మొదలుపెట్టినట్లు తెలిసింది.

కాళ్లపై పడి.. కన్నీటి పర్యంతం

- మున్నేరు పరీవాహకంలో కేంద్ర బృందం పర్యటన
- దెబ్బతిన్న ఇళ్లను చూడాలని మహిళల వేడుకోలు
- మున్నేటిని పరిశీలించి, ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించిన అధికారులు
- వరద ప్రభావం, నష్టాన్ని వివరించిన కలెక్టర్, కేఎంసీ కమిషనర్



ఫొటో ఎగ్జిబిషన్‌ను చూస్తున్న కేంద్ర బృంద సభ్యులు



మోతీనగర్‌లో మున్నేరు వరద ఎక్కడి వరకు వచ్చిందో కేంద్ర బృందానికి వివరిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మంవన్‌టౌన్: 'ఉన్నదంతా వరదల్లో కొట్టుకుపోయి కట్టుబట్టలతో మిగిలాం.. మా ఇళ్లకు రండి.. జరిగిన నష్టాన్ని చూడండి' అంటూ కేంద్ర బృందంలోని అధికారులను మున్నేరు ముంపు బాధితులు కోరారు. మున్నేటి వరదతో ఎదురైన విపత్తును పరిశీలించేందుకు జిల్లాలో కేంద్ర బృందం పర్యటన రెండో రోజైన గురువారం కూడా కొనసాగింది. జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ అడ్వైజర్ కల్నల్ కే.వీ..సింగ్ నేతృత్వాన మహేష్ కుమార్, శాంతినాథ్ శివప్ప, ఎస్.కే.కుష్వాహ, టి.నియాల్ కన్సన్, డాక్టర్ శశివర్ధన్‌రెడ్డితో కూడిన కేంద్ర బృందం రెండుగా విడిపోయి ఖమ్మం కాల్వొడ్డులోని బొక్కలగడ్డ, ప్రకాష్‌నగర్ మున్నేరు బ్రిడ్జి, మోతీనగర్‌తో పాటు ఖమ్మం రూరల్ మండలం పోలేపల్లిలోని రాజీవ్‌గృహకల్ప, దానవాయిగూడెం, తల్లంపాడు, తెల్దారుపల్లి, తనగంపాడుల్లో పర్యటించింది. ఈసందర్భంగా జరిగిన నష్టం వివరాలను ఫొటో ఎగ్జిబిషన్ల ద్వారా వారికి కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య వివరించారు. అనంతరం క్షేత్రస్థాయిలో పరిశీలించిన బృందం సభ్యులు త్వరగా ముంపు ప్రాంతాలను పూర్వ స్థితికి తీసుకొచ్చారని అధికారులను అభినందించారు. మున్నేరు సమీపాన బొక్కలగడ్డలో కూలిన ఇళ్లను పరిశీలించగా అక్కడే ఉన్న బాధిత మహిళ కారపాక స్వరూప 'మాకు మీరే దిక్కు' అంటూ కేంద్ర బృందంలోని అధికారుల కాళ్లపై పడి ఆవేదన వ్యక్తం చేసింది. తాను, తన భర్త కూలీ పనులు చేస్తేనే జీవనం, ఇప్పుడు ఇల్లు కూలడంతో రోడ్డున పడ్డామని తెలిపింది. అలాగే, నయాబజార్ కళాశాలలో నష్టాన్ని పరిశీలించారు. అక్కడి నుంచి ప్రకాష్‌నగర్‌కు చేరుకోగా బ్రిడ్జికి వరదలతో జరిగిన నష్టం, కొట్టుకుపోయిన వైకుంఠధామం, ఆపై మోతీనగర్‌లోని మున్నేటి సమీపాన వరద ప్రభావం, దానవాయిగూడెం ఇన్ టేక్‌వెల్‌ను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. బృందంతోపాటు రాష్ట్ర గనులు, భూగర్భ ఖనిజాల శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, అసిస్టెంట్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ఠ, ఆర్డీఓలు జి.గణేష్, రాజేందర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. కాగా, రాజీవ్‌గృహ కల్పలో పరిశీలన సందర్భంగా వరద ఎంత మేరకు వచ్చింది, గృహాలు ఎక్కడ వరకు మునిగాయని ఆరా తీసిన కేంద్ర బృందం.. ఈ ఇళ్లు ఎప్పుడు కట్టారో తెలుసుకోవడమే కాక నాణ్యతపై ప్రశ్నించారు. ప్రస్తుతం ఇక్కడి ఇళ్లు నివాసానికి అనుగుణంగా ఉన్నాయో, లేదో నిపుణులతో పరీక్ష చేయించాలని చెబుతూ రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో అక్కడి నుంచే ఫోన్‌లో మాట్లాడారు.

గణేష్ నిమజ్జనానికి పటిష్ట బందోబస్తు

పోలీస్ కమిషనర్ సునీల్‌దత్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీపీ

ఖమ్మంక్రైం: గణేష్ నిమజ్జనోత్సవం ఈనెల 16న జరగనుండగా, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటుచేయాలని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ ఆదేశించారు. ఈమేరకు గురువారం ఆయన జిల్లాలోని పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఏ చిన్న ఘటనకు ఆస్కారం ఇవ్వకుండా ప్రణాళికాయుతంగా బందోబస్తు ఏర్పాటుచేయాలని, భక్తులు క్షేమంగా తిరిగి ఇళ్లకు వెళ్లేలా పర్యవేక్షించాలని సూచించారు. నిమజ్జన ప్రాంతాల్లో బారికేడ్లు, క్రేన్లు ఏర్పాటుచేసి గజ ఈతగాళ్లు, మత్స్యకారులను నియమించాలని తెలిపారు. విద్యుత్, మున్సిపల్, పంచాయతీరాజ్, మత్యశాఖ అధికారుల సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని, ట్రాఫిక్ నిర్వహణ పక్కాగా చేయాలని చెప్పారు. అలాగే, భక్తులు కూడా సహకరించేలా ముందస్తు సూచనలు చేయాలని సీపీ తెలిపారు. కాగా, జిల్లాలో సమారు 27 వేల గణేష్ విగ్రహాలు రిజిస్టర్ చేయగా, ఇప్పటివరకు 243 విగ్రహాలు నిమజ్జనం చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీలు నరేష్‌కుమార్, ప్రసాద్‌రావు, ఏసీపీ సాంబరాజు పాల్గొన్నారు.

ఈనెల 16న వైన్స్, బార్లు బంద్

వినాయక నిమజ్జనం నేపథ్యాన ఈనెల 16న(సోమవారం) జిల్లాలో మద్యం విక్రయాలను నిలిపివేయాలని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ ఆదేశించారు. ఈనెల 16న ఉదయం నుంచి 17వ తేదీ వరకు ఉదయం ఆరు గంటల వరకు వైన్ షాపులు, మద్యం సరఫరా చేసే బార్లు, రెస్టారెంట్లు, క్లబ్‌లు, హోటళ్లు మూసివేయాలని తెలిపారు. గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా సాగేలా ఈ నిర్ణయం తీసుకున్నామని, ఎవరైనా నిబంధనలు అతిక్రమించి మద్యం దుకాణాలు తెరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు.

వరద బాధితులకు ఎంత చేసినా తక్కువే..

- ప్రజల ఆవేదనను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా
- ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కోదండరామ్



నయాబజార్ కళాశాలలో దెబ్బతిన్న కంప్యూటర్లు, ఫర్నిచర్‌ను పరిశీలిస్తున్న కోదండరామ్

ఖమ్మంమయూరిసెంటర్: వరద ప్రభావిత ప్రాంతాలను ప్రత్యక్షంగా చూస్తుంటే బాధితులకు ఎంత చేసినా తక్కువే అన్నట్లుగా ఉందని ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మున్నేరు వరద ప్రభావిత ప్రాంతాలైన బొక్కలగడ్డ, నయాబజార్‌ల్లో గురువారం పర్యటించిన ఆయన బాధితులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. హైదరాబాద్‌లో నివసించే ఖమ్మం మిత్రులు, మదార్‌సాబ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. ఆతర్వాత నయాబజార్ కళాశాలలో వరదతో జరిగిన నష్టాన్ని పరిశీలించగా వివరాలను ప్రిన్సిపాల్ వెల్లడించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రకృతి విపత్తులు ఎదురైనప్పుడు ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకోవడమే కాక, వాతావరణంలో వస్తున్న మార్పులకు తగినట్లుగా ముందస్తు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. మున్నేరు వరద బాధితులు సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలారని, వారికి తక్షణ సహాయంతో పాటు మనోధైర్యాన్ని కల్పించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. తక్షణ సాయం రూ.16,500 ఇవ్వడమే కాక మరింత సాయం అందించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కాగా, నయాబజార్ పాఠశాలలో సర్టిఫికెట్లు కోల్పోయిన బాధితులు దరఖాస్తు చేసుకునేలా ఏర్పాటుచేసిన కేంద్రాన్ని కోదండరామ్ పరిశీలించారు. తెలంగాణ జన సమితి జిల్లా ఇన్‌చార్జ్ గోపగాని శంకర్‌రావు, కన్వీనర్ బాబు, నాయకులు అంబటి శ్రీనివాస్, బైరి రమేష్, ఎం.నరసయ్యతో పాటు సీహెచ్.వీరారెడ్డి, జైపాల్‌రెడ్డి, కె.వెంకటేశ్వర్లు, సురేష్, కృష్ణవేణి పాల్గొన్నారు.

ఆనందభాష్పాలు !



కుమారుడు ముద్దాడుతుండగా కన్నీరు పెడుతున్న వెంకటరమణమ్మ



తల్లికి పోలీసు క్యాప్ పెట్టి సెల్యూట్ చేస్తున్న కోటేశ్వరరావు

బిడ్డ ప్రయోజకుడై పోలీసు యూనిఫామ్‌లో వచ్చి తనకు సెల్యూట్ చేసిన వేళ ఆ తల్లి ఆనందం పట్టలేకపోయింది. ఆమె కళ్లు ఆనందభాష్పాలను వర్షించాయి! రఘునాథపాలెం మండలంలోని వీ.వీ.పాలెంకు చెందిన తాళ్లూరి కోటేశ్వరరావు సివిల్ ఎస్ఐగా శిక్షణ పూర్తిచేసుకోగా బుధవారం పాసింగ్ ఔట్ పరేడ్‌లో పాల్గొన్నారు. ఈ పరేడ్‌ను ఆయన తల్లిదండ్రులు బిక్షం – వెంకటరమణమ్మతో పాటు సోదరులు గోపి, నర్సింహారావు వీక్షించారు. అనంతరం యూనిఫామ్‌లో తల్లిదండ్రుల వద్దకు వచ్చిన కోటేశ్వరరావు తన క్యాప్ తల్లికి పెట్టి సెల్యూట్ చేయడంతో పాటు హత్తుకోగా ఆమె ఆనందంతో కన్నీటి పర్యంతమైంది. కాగా, బిక్షం ఎన్నెస్పీలో లష్కర్‌గా పనిచేసి రిటైర్డ్ కాగా, తల్లి గృహిణి. ఇక కోటేశ్వరరావు సోదరులిద్దరు ప్రైవేట్ ఉద్యోగాలు చేస్తున్నారు. కోటేశ్వరరావును భద్రాద్రి జోన్‌కు కేటాయించగా రిపోర్టు చేశాక పోస్టింగ్ ఇవ్వనున్నారు.

– రఘునాథపాలెం

'గృహజ్యోతి'కి రాయితీపై మీటర్లు

రూ.938 చెల్లిస్తే రెండు రోజుల్లో మీటర్

ఖమ్మంవ్యవసాయం: దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న గృహజ్యోతి పథకం లబ్ధిదారులకు రాయితీపై విద్యుత్ మీటర్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రజాపాలన సభలను ఈనెల 17వ తేదీ నుంచి నిర్వహించనుండగా, అర్హులైన కుటుంబాలు గృహజ్యోతి పథకానికి దరఖాస్తు చేసుకునేలా ఈ అవకాశాన్ని కల్పించారు. 500 వాట్ల విద్యుత్ వినియోగం కలిగిన వారు దరఖాస్తు, డెవలప్‌మెంట్ చార్జీలు, సెక్యూరిటీ డిపాజిట్‌తో పాటు జీఎస్టీ కలిపి రూ.938ను నేరుగా సెక్షన్ పరిధిలో అసిస్టెంట్ ఇంజనీర్(ఏఈ)కు చెల్లిస్తే రెండు రోజుల వ్యవధిలో ఇంటికి నూతన మీటర్ బిగిస్తారు. ఈ సమయంలో దరఖాస్తుదారుడు ఆధార్ కార్డు, ఇంటి ధ్రువపత్రాలు, గ్రామపంచాయతీ, మున్సిపాలిటీ అనుమతి పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. ఈనెల 16వ తేదీలోగా నగదు చెల్లించి 17వ తేదీ నుంచి జరిగే ప్రజాపాలన సభల్లో అర్హులైన వారు గృహజ్యోతి పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చు. తద్వారా మీ సేవా వంటి కార్యాలయాలతో సంబంధం లేకుండా మీటర్లు పొందే అవకాశముంటుంది. ఈ అవకాశాన్ని అర్హులు వినియోగించుకోవాలని ఖమ్మం ఎస్ఈ ఏ.సురేందర్ సూచించారు. ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం నుంచి గురువారం సాయంత్రం ఉత్తర్వులు విడుదలయ్యాయని ఆయన తెలిపారు.

కార్యదర్శుల బదిలీలపై అసంతృప్తి

కౌన్సెలింగ్ ద్వారా నిర్వహించాలని డిమాండ్

నేలకొండపల్లి: జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులు బదిలీలపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మొత్తం 387 మంది పంచాయతీ కార్యదర్శులను బుధవారం బదిలీ చేయగా, స్పౌజ్ కేటగిరీ ఉద్యోగులు, ఒంటరి మహిళలు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు, రిటైర్‌మెంట్‌కు దగ్గరలో ఉన్న వారే కాక దివ్యాంగులు ఈ జాబితాలో ఉన్నారు. అయితే, అర్ధాంతరంగా తమను సుదూర ప్రాంతాలకు బదిలీ చేయడంతో కుటుంబాలు ఇబ్బందికి గురయ్యే అవకాశముందని వారు వాపోతున్నారు. సొంత మండలం, ప్రస్తుతం పనిచేసే మండలాన్ని మినహాయించి బదిలీ చేస్తే అభ్యంతరం లేకున్నా, సుదూర ప్రాంతాలకు బదిలీలు చేయడం సరికాదని చెబుతున్నారు. ఇకనైనా ఉత్తర్వులను ఉపసంహరించుకుని కౌన్సెలింగ్ విధానంలో బదిలీ చేసేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ టీఎస్జీవోస్ నాయకులకు లేఖ రాయడం చర్చనీయాంశంగా మారింది.

నేడు ఓటర్ల ముసాయిదా విడుదల

- 589 పంచాయతీలు, 5,398 వార్డుల్లో వివరాలు సిద్ధం
- కార్యదర్శుల బదిలీలతో ఇక్కట్లు ఎదురయ్యే అవకాశం



ఎర్రుపాలెంలో ఉద్యోగులకు సూచనలు చేస్తున్న డీపీఓ ఆశాలత

నేలకొండపల్లి/రఘునాథపాలెం: గ్రామపంచాయతీల్లో వార్డుల వారీగా ఓటర్ల ముసాయిదాను శుక్రవారం విడుదల చేయనున్నారు. ఈనెల 6వ తేదీనే విడుదల చేయాల్సి ఉన్నప్పటికీ భారీ వర్షాల కారణంగా వాయిదా పడింది. ఈ నేపథ్యాన జిల్లాలోని 589 గ్రామపంచాయతీల్లో 5,398 వార్డులకు సంబంధించి ఓటర్ల ముసాయిదా విడుదల చేయనున్నారు. ఆతర్వాత 13నుంచి అభ్యంతరాలు స్వీకరించడంతో పాటు 18న జిల్లా స్థాయిలో, 19న మండల స్థాయిలో పార్టీల నాయకులతో సమావేశాలు నిర్వహించి సందేహాలను నివృత్తి చేస్తారు. అనంతరం 26న డీపీఓ అభ్యంతరాలపై తుది నిర్ణయం తీసుకుని, 28వ తేదీన ఓటర్ల తుది జాబితా ప్రకటిస్తారు.

కార్యదర్శుల బదిలీలతో ఇక్కట్లు?

తాజాగా జిల్లాలో భారీగా పంచాయతీ కార్యదర్శులను బదిలీ చేశారు. ఈక్రమంలో ఓటర్ల జాబితా ముసాయిదా విడుదలలో సమస్య ఎదురవుతోంది. అయితే, పంచాయతీ కార్యదర్శులను పాత స్థానాల నుంచి వెంటనే రిలీవ్ చేయాలని సూచించగా, శుక్రవారం ఉదయం కల్లా నూతన స్థానాల్లో చేరాల్సి ఉంటుంది. మధ్యాహ్నం 12గంటలకల్లా ఓటర్ల జాబితా విడుదల చేయాలని అధికారులు ఆదేశించారు. ఎక్కడైనా కార్యదర్శులు అందుబాటులో లేకపోతే అక్కడి సిబ్బంది అయినా జాబితా విడుదల చేయాల్సి ఉంటుంది. కాగా, ఓటర్ల జాబితాల రూపకల్పన చాలా మండలాల్లో గురువారం అర్ధరాత్రి పొద్దుపోయే వరకు కొనసాగింది.

పర్యవేక్షించిన డీపీఓ

ఎర్రుపాలెం/బోనకల్/చింతకాని: గ్రామపంచాయతీల్లో ఓటర్ల ముసాయిదా శుక్రవారం విడుదల చేయాల్సి ఉండడంతో జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) ఆశాలత గురువారం పలు మండలాల్లో పర్యటించారు. ఎర్రుపాలెం, బోనకల్, చింతకాని ఎంపీడీఓ కార్యాలయాల్లో పరిశీలించిన ఆమె ఓటర్ల జాబితా తయారీని పరిశీలించి సూచనలు చేశారు. ఎంపీడీఓలు సురేందర్‌నాయక్, రామయ్య, డీఎల్పీఓ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

8,399 కుటుంబాలకు ప్రభుత్వ సాయం

ఖాతా వివరాలు సక్రమంగా లేనివి 893

ఖమ్మంమయూరిసెంటర్: మున్నేటి వరదలతో ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 9,292 ఇళ్లు నీట మునిగినట్లు అధికారులు సర్వే ద్వారా గుర్తించారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం రూ.16,500 చొప్పున ఆర్థిక సాయం మంజూరు చేసింది. సర్వేలో భాగంగా అధికారులు సేకరించిన బ్యాంక్ ఖాతాల్లో ఈనెల 10 నుండి నగదు జమ చేస్తున్నారు. ఇప్పటి వరకు 8,399 కుటుంబాలకు సాయం జమ కాగా, మరో 893 బ్యాంక్ ఖాతాల వివరాలు తప్పుగా ఉండడంతో జమ కాలేదని అధికారులు తెలిపారు. దీంతో ఆయా కుటుంబాల వద్దకు మరోసారి బిల్ కలెక్టర్లు వెళ్లి వివరాలు సేకరించనున్నారు. ఇక వరదతో సర్టిఫికెట్లు కోల్పోయిన 445 మంది దరఖాస్తు చేసుకున్నట్లు అధికారులు తెలిపారు.

క్లుప్తంగా

కాంట్రాక్టు టీచర్ పోస్టులకు దరఖాస్తులు

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లాలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం బోధించేందుకు కాంట్రాక్టు విధానంలో రెసిడెన్షియల్ టీచర్లను నియమించనున్నట్లు గిరిజన సంక్షేమ శాఖ అధికారులు తెలిపారు. ఉసిరికాయలపల్లి, ఖమ్మం ఏ(గొల్లగూడెం), ఖమ్మం బీ(కొణిజర్ల), కల్లూరు పాఠశాలల్లో పలు పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈనెల 21వ తేదీ లోగా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

ట్రాఫిక్‌లో నిలిచిన మంత్రి కాన్వాయ్



వంతెనపై స్తంభించిన ట్రాఫిక్

వైరారూరల్: వైరా మండలం స్టేజీ పినపాక హైలెవల్ వంతెనపై ట్రాఫిక్‌లో గురువారం రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కాన్వాయ్ కొద్దిసేపు నిలిచిపోయింది. హైలెవల్ వంతెన జాయింట్లపై ఏర్పడిన భారీ గుంతలో లారీ నిలిచిపోయింది. దీంతో రెండువైపులా ట్రాఫిక్ స్తంభించింది. అదే సమయాన సత్తుపల్లి వైపు నుండి ఖమ్మం వెళ్తున్న రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కాన్వాయ్ వంతెనపైకి రావడంతో ట్రాఫిక్‌లో చిక్కుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు మరో ట్రక్కుతో వంతెనపై నిలిచిన లారీని కిందకు దించాక మంత్రి వాహనాలను పంపించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

నూతన ఓటర్ల నమోదుకు ఇంటింటి సర్వే



కారేపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీజ

కారేపల్లి/ఏన్కూరు: ఓటర్లుగా అర్హత సాధించిన వారి నమోదుకు ఇంటింటి సర్వే చేపట్టాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ ఆదేశించారు. కారేపల్లి, ఏన్కూరులో తహసీల్, ఎంపీడీఓ కార్యాలయాలను గురువారం సందర్శించిన ఆమె గ్రామపంచాయతీ ఓటర్ల జాబితా రూపకల్పనను పరిశీలించి అధికారులను సమీక్షించారు. బదిలీ అయిన గ్రామ కార్యదర్శులను రిలీవ్ చేయాలని తెలిపారు. అలాగే, కారేపల్లిలో కేజీబీవీని సందర్శించిన ఆమె, ఏన్కూరులో అమ్మ ఆదర్శ పాఠశాలల పనులపై ఆరా తీశారు. తహసీల్దార్లు సంపత్‌కుమార్, సీహెచ్.శేషగిరిరావు, ఎంపీడీఓలు రమేష్, సకినాల రమేష్, ఉద్యోగులు నరసింహారావు, ఎస్‌కే.పర్వీనా, జీవీఎస్.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

జేసీబీ డ్రైవర్ సుభానీకి నగదు ప్రోత్సాహం



సుభానీకి చెక్కు అందజేస్తున్న దృశ్యం

ఖమ్మం మామిళ్లగూడెం: ఇటీవల ఖమ్మం ప్రకాశనగర్ బ్రిడ్జిపై మున్నేటి వరదలో చిక్కుకున్న తొమ్మిది మందిని కాపాడిన జేసీబీ డ్రైవర్ సుభాని ఖాన్‌కు జమాతే ఇస్లామి హింద్ ఆధ్వర్యాన సన్మానించారు. హైదరాబాద్‌లోని కార్యాలయంలో ఆయనను గురువారం సన్మానించిన రాష్ట్ర అధ్యక్షు డు డాక్టర్ ఖలీద్‌ముబష్శిర్ ఉజ్ ఆఫర్ రూ.25వేల నగదు ప్రోత్సాహకం అందజేశారు. 'పోతే ఒక్కడిని.. వస్తే పది మందిమి' అంటూ ప్రాణాలకు తెగించి బాధితులను కాపాడిన సుభానీ అభినందనీయుడన్నారు. కార్యక్రమంలో స్టూడెంట్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ హఫీజ్, ఖలిదా పర్వీన్ పాల్గొన్నారు.

హైవేపై కారు బోల్తా

నేలకొండపల్లి: జాతీయ రహదారిపై ప్రమాదవశాత్తు కారు బోల్తా పడింది. కోదాడ నుంచి ఖమ్మం వైపునకు కారు వస్తుండగా నేలకొండపల్లిలోని చెరువు కట్ట సమీపాన టైరు పంక్చర్ అయ్యింది. దీంతో కారు పల్టీలు కొట్టింది. అందులో ఉన్న వారు స్వల్ప గాయాలతో బయటపడగా వాహనం పూర్తిగా నుజ్జునుజ్జయింది. అయితే, బాధితుల వివరాలు తెలియాల్సి ఉంది.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	7,400	6,000
పెసలు (మార్క్‌ఫెడ్)	8,682	8,682
కందులు	9,600	7,700
అలసంద	7,700	7,700
మిర్చి	17,600	7.000
ఏసీ మిర్చి	20,000	10,500
ఏసీ తాలు	9,500	7,000
పత్తి	7,900	5,000

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.14,392

ఎరుపు జిల్లాలో ఏచూరి అడుగులు

- ఉమ్మడి జిల్లాతో సీతారాం ఏచూరికి అనుబంధం
- తమ్మినేని వీరభద్రం 'దుమ్ముగూడెం' యాత్రకు హాజరు
- గత ఏడాది నవంబర్‌లో అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి రాక



సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న తమ్మినేని, నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: సీపీఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి ఉమ్మడి ఖమ్మం జిల్లాతో ప్రత్యేక అనుబంధం ఉంది. జిల్లాలో ప్రజాతంత్ర ఉద్యమాల నిర్వహణలో ఆయన భాగస్వామ్యం ఉంది. గురువారం సీతారాం మృతి చెందడంతో పలువురు ఆయనతో జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. దాదాపు 30 ఏళ్లుగా జిల్లాతో అనుబంధం కొనసాగిస్తున్న ఆయన ఇక్కడ నిర్వహించిన రాజకీయ శిక్షణా తరగతులు, సైద్ధాంతిక అవగాహన కార్యక్రమాలకు హాజరయ్యారు. ఖమ్మంలో 2012లో నిర్వహించిన ఉమ్మడి ఏపీ రాష్ట్ర మహాసభల విజయవంతంలోనూ ఏచూరి కీలకంగా వ్యవహరించారు. ఆ మహాసభల సమయాన వారం పాటు ఖమ్మంలోనే ఉండి పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. 2008 జూలై 28న ముదిగొండలో నిర్వహించిన భూపోరాట అమరవీరుల ప్రథమ వర్ధంతి సభకు సైతం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చివరిగా గత ఏడాది నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి వచ్చారు. ఖమ్మంలోని మంచికంటి మీటింగ్ హాల్‌లో 'ఎన్నికలు – ప్రజాస్వామ్యం–సీపీఎం వైఖరి'పై నవంబర్ 25న నిర్వహించిన సెమినార్‌లో పాల్గొన్నారు. అదేరోజు ఖమ్మం రూరల్ మండలం ఎం.వెంకటాయపాలెంలో పార్టీ పాలేరు నియోజకవర్గ అభ్యర్థి తమ్మినేని వీరభద్రం విజయాన్ని కాంక్షిస్తూ ప్రచార సభలో మాట్లాడారు. ఎన్నికల్లో డబ్బు ప్రాధాన్యత పెరిగిందని.. ప్రలోభాలకు లోనై ఓటును దుర్వినియోగం చేసుకోవద్దని పిలుపునిచ్చారు.

వామపక్ష ఉద్యమాల్లో ..

ఉమ్మడి జిల్లాలో చేపట్టిన అనేక వామపక్ష, ప్రజాతంత్ర ఉద్యమాలకు ఏచూరి హాజరై ముందుకు నడిపారు. పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడిగా, పొలిట్‌బ్యూరో సభ్యుడిగా, ప్రధాన కార్యదర్శిగా వివిధ హోదాల్లో పలు కార్యక్రమాలకు హాజరయ్యారు. భక్త రామదాసు కళాక్షేత్రం, సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహించిన సభల్లో ప్రసంగించారు. ఏచూరి ఎస్ఎఫ్ఐ ఆలిండియా కార్యదర్శిగా ఉన్న సమయాన ఉమ్మడి జిల్లాలో యూనియన్ బాధ్యతలు నిర్వర్తించిన పలువురికి ఆయనతో ప్రత్యక్ష అనుబంధం ఏర్పడింది. ఆయా నాయకులు ప్రస్తుతం డాక్టర్లుగా, న్యాయవాదులుగా కొనసాగుతున్నారు. దుమ్ముగూడెం ప్రాజెక్టు సాధన కోసం 2003లో తమ్మినేని వీరభద్రం నిర్వహించిన మహాప్రస్థానం పాదయాత్రలో తెల్దారుపల్లి నుంచి ఖమ్మం వరకు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరి మృతిపై పలువురి నివాళి

సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతిపై వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు సంతాపం ప్రకటించారు. ఏచూరితో తమకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఖమ్మంలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సంతాప సభలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పాల్గొని ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఐ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే పువ్వాడ నాగేశ్వరరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాత మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య కూడా వేర్వేరు ప్రకటనల్లో ఏచూరి మృతిపై సంతాపం తెలిపారు.



సీపీఎం జిల్లా కార్యాలయానికి వచ్చిన సమయాన నాయకులతో సీతారాం ఏచూరి (ఫైల్)

వరద బాధితులకు 'రోటరీ' చేయూత

ఖమ్మంవన్‌టౌన్: మున్నేరు వరదతో నష్టపోయి కట్టుబట్టలతో మిగిలిన 250 కుటుంబాలకు రోటరీ క్లబ్ తరఫున నిత్యావసర వస్తువులు అందజేశారు. ఈ మేరకు రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా గురువారం వారికి సరుకులు పంపిణీ చేయగా మంత్రి మాట్లాడారు. వరద బాధితులను ప్రభుత్వం ఆదుకుంటుండగా, ముందుకొస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర గిడ్డంగులు, విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్లు రాయల నాగేశ్వరరావు, అన్వేష్‌రెడ్డి, మేయర్ పునుకొల్లు నీరజ, నాయకులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కమర్తపు మురళి, పాలెపు వెంకటరమణ, రావూరి సైదుబాబు, రోటరీ క్లబ్ సభ్యులు కందుల కొండల్‌రావు, డి.సాంబశివరావు, రవీంద్రనాథ్, సాయి భార్గవ్, పెరసాని శ్రీనివాసరావు, వి.సుధాకర్‌రావు, మన్నె ప్రవీణ్‌కుమార్, డాక్టర్ కిలారు సునీల్, డాక్టర్ రాజ్‌కుమార్, పోటు ప్రసాదరావు, కోలా సైదులు, వై.హన్మంతతరావు, ఎన్.సందీప్‌కుమార్, తాళ్లూరి ఉపేందర్ ఇతరులు పాల్గొన్నారు.

ఐదుగురికి ల్యాప్‌టాప్‌లు..

ఖమ్మం సహకారనగర్: చేతన ఫౌండేషన్ చేస్తున్న సేవలు అభినందనీయమని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. హైదరాబాద్‌లో డిగ్రీ చదువుతున్న ఐదుగురు అంధ విద్యార్థులకు ఫౌండేషన్ ద్వారా లాప్‌టాప్‌లు సమకూర్చగా మంత్రి అందజేసి మాట్లాడారు. కేఎంసీ మేయర్ పి.నీరజ, చేతన ఫౌండేషన్ అధ్యక్షుడు వెనిగళ్ల రవికుమార్, సభ్యులు వెనిగళ్ల అనిల్‌కుమార్, దొడ్డ సీతారామయ్య, ముత్తినేని సురేష్, చంద్రకాని నవీన్, షేక్ రషీద్ పాల్గొన్నారు.



నిత్యావసర వస్తువులు అందచేస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



ల్యాప్‌టాప్‌లు అందచేస్తున్న మంత్రి తుమ్మల, పక్కన రవికుమార్ తదితరులు

వరదలను జాతీయ విపత్తుగా గుర్తించాలి

- కేంద్రం రూ.10 వేల కోట్ల ప్యాకేజీని ప్రకటించాల్సిందే..
- కలెక్టరేట్ వద్ద ధర్నాలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని



ధర్నాను ఉద్దేశించి మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని, పక్కన నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణలో సంభవించిన వరదలను జాతీయ విపత్తుగా గుర్తించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. కేంద్రప్రభుత్వం ఓదార్పు మాటలకు పరిమితం కాకుండా తక్షణ సాయంగా రూ.10 వేల కోట్లను ప్రత్యేక ప్యాకేజీగా ప్రకటించాలన్నారు. వరద సాయం పెంచడంతో పాటు జాతీయ విపత్తుగా గుర్తించాలన్న డిమాండ్‌తో సీపీఐ ఆధ్వర్యాన గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ కనీవినీ ఎరుగని రీతిలో కురిసిన వర్షంతో తెలంగాణలోని పలు ప్రాంతాలకు తీవ్ర నష్టం వాటిల్లిందని, మహబూబాబాద్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో భారీ నష్టం ఎదురైందని చెప్పారు. వేలాది మంది ప్రజలు సర్వం కోల్పోయినందున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. రైతులు పంటలపై ఎకరాకు రూ.40వేల మేర వెచ్చిస్తే రూ.10వేల సాయం ప్రకటించడం సరికాదని పేర్కొన్నారు. పెట్టుబడి ఆధారంగా పరిహారం ప్రకటించడమే కాక ఇళ్లలో సామగ్రి నష్టం మేరకు పరిహారం ఇవ్వాలని, పూర్తిగా దెబ్బతిన్న ఇళ్ల స్థానంలో ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని కూనంనేని డిమాండ్ చేశారు. అలాగే, పేదలకు రూ.30 వేల పరిహారం, రెండు నెలల పాటు నిత్యావసర సరుకులు అందించాలని, ప్రైవేట్ పాఠశాలల్లోని విద్యార్థులకు ఫీజులు ప్రభుత్వమే భరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, నాయకులు జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రా బాబు, ఎస్‌కే.జానీమియా, ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు, పోటు కళావతి, క్లైమెంట్, తాటి వెంకటేశ్వరరావు, సీహెచ్.సీతామహాలక్ష్మి, అజ్మీరా రామ్మూర్తి, దొండపాటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కొట్టుకుపోయిన పొలాల పరిశీలన



ముదిగొండ : మున్నేరు ఉధృతితో కొట్టుకుపోయిన పొలాలను పరిశీలిస్తున్న అన్వేష్‌రెడ్డి, తదితరులు

ముదిగొండ: మండలంలోని పండ్రేగుపల్లి, పెద్దమండవ గ్రామాల్లో ఇటీవల భారీ వర్షాల కారణంగా మున్నేరు వరద ఉధృతితో పంట పొలాలు దెబ్బతిన్నాయి. ఈ ప్రాంతంలో పొలాలను రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకేట అన్వేష్‌రెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు గురువారం పరిశీలించారు. ఆయా గ్రామాల్లో రైతులతో పాటు మధిర ఏడీఏ విజయచంద్ర, ఏఓ సరితతో పంట నష్టం వివరాలను తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా చూస్తామని, రైతులు అధైర్యపడొద్దని చెప్పారు. కాంగ్రెస్ మండలల జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు నల్లమల వెంకటేశ్వరరావు, కోడే నాగేశ్వరరావు, సింగు రాజయ్య, పసుపులేటి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

'విత్తన' ఉద్యోగుల ఒకరోజు వేతనం

ఖమ్మంవ్యవసాయం/ఖమ్మం అర్బన్: వరద బాధితుల సహాయార్థం తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ ఉద్యోగులు ఒకరోజు వేతనాన్ని విరాళం అందజేశారు. ఈ నిధులతో సమకూర్చిన నిత్యావసరాలను గురువారం ఖమ్మం కవిరాజ్‌నగర్‌లోని ముంపు ప్రాంతాల ప్రజలు 200మందికి సంస్థ చైర్మన్ సుంకేట అన్వేష్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, కేఎంసీ మేయర్ పునుకొల్లు నీరజ, కార్పొరేటర్ సరిపూడి రమాసతీష్, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, సంస్థ ఉద్యోగులతో పాటు నాయకులు నల్లమల వెంకటేశ్వరరావు, దొబ్బల సౌజన్య, కొంటేముక్కల నాగేశ్వరరావు, బాలాజీ నాయక్, కీసర పద్మజారెడ్డి, ఫరీద్‌ఖాద్రీ, ప్రతిభారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెసల కొనుగోళ్లు అంతంతే...



పెసలు కొనుగోలు చేయాలని మార్కెటింగ్ శాఖ అధికారిని కోరుతున్న రైతులు

ఖమ్మంవ్యవసాయం: ఇటీవల వర్షాలు, వరదతో పంటలు దెబ్బతిన్నాయి. ఇందులో భాగంగా పెసల పంట కూడా తడిసిపోవడంతో ప్రభుత్వ పెద్దలు పరిశీలించిన సందర్భంగా రైతులకు న్యాయం చేస్తామని, దెబ్బతిన్న ప్రతీ గింజ కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం పెసలు క్వింటాకు రూ.8,682గా మద్దతు ధర ప్రకటించింది. కానీ ఖమ్మం మార్కెట్‌లో వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి రూ.6 వేలకు మించి చెల్లించడం లేదు. దీంతో మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించగా, తాజా వర్షాలతో దెబ్బతిన్న పంటను కొనడానికి కొర్రీలు పెడుతున్నారు. తేమ 12 శాతానికి మించి ఉందని తిరస్కరిస్తున్నారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లోని కొనుగోలు కేంద్రానికి గురువారం వంద మందికి పైగా రైతులు పెసలను తీసుకొస్తే 30 మంది నుంచే కొనుగోలు చేశారు. దీంతో మిగిలిన రైతులు ప్రైవేట్ వ్యాపారులకు రూ.6వేల లోపు ధరకే అమ్ముకున్నారు. ఈనేపథ్యాన పరిశీలనకు వచ్చిన జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి అలీంను రైతులు నిలదీశారు. వర్షాలతో దెబ్బతిన్న పంట విషయంలో నాణ్యత, తేమ పేరిట మార్క్‌ఫెడ్ అధికారులు తిరస్కరిస్తున్నారని చెప్పగా.. సమస్యలను పరిష్కరిస్తామని ఆయన తెలిపారు.

అధికారులు వస్తున్నారని హడావుడి



ఉదయం 8.50 గంటలకు : ట్రాక్టర్, జేసీబీతో చెత్త తొలగిస్తున్న దృశ్యం



ఉదయం 10.25 గంటలకు : వాహనాలు వెళ్లిపోవడంతో ఖాళీగా కాల్వొడ్డు ప్రాంతం

ఉన్నతస్థాయి అధికారులు వస్తున్నారని తెలిస్తే చాలు హడావుడి చేసే ఉద్యోగులు ఆ తర్వాత పనులన్నీ వదిలేయడం పరిపాటిగా మారింది. మున్నేరు పరీవాహక ప్రాంతాల్లో ఇటీవల వరదతో భారీగా చెత్తాచెదారం పేరుకుపోయింది. ఈ ప్రాంతాన్ని పరిశీలించేందుకు గురువారం కేంద్ర బృందం వస్తుందని తెలియగానే ఉదయం 8.50 గంటలకు కాల్వొడ్డు ప్రాంతాన చెత్తాచెదారాన్ని ట్రాక్టర్, జేసీబీతో తొలగించడం ప్రారంభించారు. అధికారులు వచ్చి పరిశీలించి వెళ్లాక 10.35 గంటల ప్రాంతాన చూస్తే అక్కడ ట్రాక్టర్, జేసీబీ కానీ సిబ్బంది కానీ లేకపోవడం గమనార్హం.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్

రాష్ట్ర స్థాయి పోటీలకు బాల్‌బాడ్మింటన్ జట్ల ఎంపిక



ఎంపికైన బాలబాలికలతో అసోసియేషన్ బాధ్యులు, పీఈటీలు

బోనకల్: హైదరాబాద్ కూకట్‌పల్లిలో ఈనెల 14, 15వ తేదీల్లో జరగనున్న రాష్ట్ర స్థాయి బాల్ బాడ్మింటన్ పోటీలకు జిల్లా బాలురు, బాలికల జట్లను ఎంపిక చేశారు. బోనకల్‌లో గురువారం జరిగిన ఎంపిక పోటీలకు వివిధ ప్రాంతాల నుంచి 127 మంది బాలబాలికలు హాజరయ్యారు. వీరి నుంచి సబ్ జూనియర్స్ బాలికల విభాగంలో టి.జ్యోతిర్మయి, కె.సుమలత, కె.ఆకాంక్ష, కె.నవ్య, తేజశ్విని, వై.దివ్య, అక్షయ, ఎం.ఎన్నిక, కె.హేమిత, కె.ఊహిత, పి.సోమశ్రీ, బాలుర విభాగంలో మునీరుద్దీన్, హర్షవర్ధన్, సురేష్, యాకూబ్ పాషా, అదమ్సమీ, జోష్, ఫిరోజ్, వెంకట్రావు, ప్రేమ్, సాయి, మనోజ్, అఖిల్ ఎంపికయ్యారని బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి బొంతు శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ బాధ్యులు, పీడీలు, పీఈటీలు, సీనియర్ క్రీడాకారులు అమిరేసి లింగయ్య, రమేష్, శశిధర్, సంధ్యారాణి, స్వాతి, రజిత, దుర్గ, తిరుపతిరావు, బి. గోపి, జగదీష్ పాల్గొన్నారు.

ములకలపల్లి నుంచి తొలి మహిళా ఎస్సై

శిక్షణ పూర్తి చేసిన సాయిన్ని నవిత



సాయిన్ని నవిత

ములకలపల్లి: ములకలపల్లి మండలానికి చెందిన సాయిన్ని నవిత ఈ మండలంలో తొలి మహిళా సివిల్ ఎస్సైగా శిక్షణ పూర్తి చేశారు. మండలంలోని సూరంపాలెం గ్రామానికి చెందిన సాయిన్ని దుర్గావాణి, రమణారావు దంపతుల కూతురు నవిత జగన్నాథపురం ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి వరకు చదివారు. ఇంటర్ అనంతరం 2021లో ఇంజనీరింగ్ పూర్తి చేశారు. అనంతరం ఆమె మేనమామ అనుమల సత్యనారాయణ దంపతుల ప్రోత్సాహంతో పోలీస్‌శాఖలో కొలువుపై దృష్టి సారించారు. 2023లో పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు నిర్వహించిన పరీక్షలో తొలి ప్రయత్నంలోనే సివిల్ ఎస్సై పోస్టు దక్కించుకున్నారు. హైదరాబాద్‌లో శిక్షణ పూర్తికాగా, బుధవారం రాష్ట్ర పోలీస్ అకాడమీలో నిర్వహించిన పాసింగ్ ఔట్ పరేడ్ (పీఓపీ) పూర్తి చేశారు. ఈ పరేడ్‌కు ముఖ్య అతిథిగా హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి నూతన ఎస్సైలకు దిశానిర్దేశం చేశారు. మారుమూల ఏజెన్సీ మండలమైన ములకలపల్లి నుంచి ఎస్సైగా నవిత బాధ్యతలు స్వీకరించనుండడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పక్కా ప్రణాళిక, మహిళలు అన్నిరంగాల్లోనూ రాణించాలనే భావనతో సాధన చేయగా తొలి ప్రయత్నంలోనే ఎస్సైగా ఎంపికయ్యాయనని, ప్రజాసేవే లక్ష్యంగా విధులు నిర్వర్తిస్తానని నవిత తెలిపారు.

హ్యాండ్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక



ఎంపికైన వారితో అసోసియేషన్ బాధ్యులు

ఖమ్మం స్పోర్ట్స్ : ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జిల్లాస్థాయి సబ్‌జూనియర్ హ్యాండ్‌బాల్ జట్టు ఎంపికకు గురువారం పోటీలు నిర్వహించారు. ఇక్కడ ప్రతిభ కనబర్చిన వారితో ఈనెల 14నుంచి వరంగల్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు బాలుర జట్టును ఎంపిక చేశామని హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి డాక్టర్ పి.రఘునందన్ ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలను అసోసియేషన్ బాధ్యులు సీహెచ్.కృష్ణయ్య, పాముల శ్రీనివాస్, కాంతరావు, దర్గానరేష్, రామంజనేయులు, కరుణాకర్, సాయితేజ పర్యవేక్షించారు.

బండెనక బండి..!



పెద్దసంఖ్యలో జేసీబీలతో వెళ్తున్న గూడ్స్ రైలు గురువారం ఖమ్మం రైల్వేస్టేషన్‌లో కాసేపు ఆగింది. వరంగల్ వైపు నుంచి విజయవాడ వైపు ఈ రైలు వెళ్తోంది. సిగ్నల్ కోసం ఖమ్మం రైల్వేస్టేషన్‌లో కొద్దిసేపు ఆగగా.. ప్రయాణికులు ఆసక్తిగా తిలకించారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్

ఎద్దు ఢీకొట్టడంతో మహిళకు గాయాలు

నేలకొండపల్లి: ఎద్దు ఢీకొట్టటంతో ఓ మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని మంగాపురం తండాకు చెందిన భాగ్యమ్మ గ్రామంలో రేషన్ బియ్యం తీసుకొచ్చేందుకు గురువారం సాయంత్రం బయలుదేరింది. అదే సమయాన పొలం నుంచి ఇంటికి వస్తున్న ఎద్దు ఒక్కసారిగా ఆమెను ఢీకొట్టడమే కాక కింద పడిన భాగ్యమ్మను బలంగా తొక్కింది. దీంతో తీవ్ర గాయాలైన ఆమెను ఆస్పత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



రామారావు (ఫైల్)

ఏన్కూరు: పొలం వద్ద మోటార్ ఆన్ చేసే క్రమాన విద్యుదాఘాతంతో ఓ రైతు మృతి చెందాడు. మండలంలోని శ్రీరాంగిరికి చెందిన దుగ్గినేని రామారావు(70) బుధవారం సాయంత్రం తన పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లాడు. అక్కడ మోటర్ ఆన్ చేసేక్రమంలో ప్రమాదవశాత్తు కాలికి వైరు తాకగా షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు. అయితే, రాత్రి వరకు ఈ విషయాన్ని ఎవరు గుర్తించలేదు. అప్పటివరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు పొలానికి వెళ్లి చూడగా రామారావు మృతదేహం కనిపించింది. ఆయన భార్య దుర్గమ్మ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బాదావత్ రవి తెలిపారు.

అరక దున్నేందుకు వెళ్లి గుండెపోటుతో...



రాములు (ఫైల్)

తిరుమలాయపాలెం: ఓ రైతు చేనులో అరక దున్నేందుకు వెళ్లిన వ్యవసాయ కార్మికుడు గుండెపోటుతో మృతి చెందాడు. మండలంలోని ఎదుళ్లచెరువుకు చెందిన పులుగుజ్జు రాములు(45) వ్యవసాయ కూలీగా జీవనం సాగిస్తున్నాడు. ఆయన గురువారం పాపాయిగూడెంలో ఓ రైతు పంట చేనులో అరక దున్నేందుకు వెళ్లగా గుండెపోటు వచ్చింది. దీంతో రాములును తిరుమలాయపాలెం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ఆయనకు భార్య అక్కమ్మ, కుమార్తె ఉండగా కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.